ప్రజాశక్తి
సోమవారం 17 నవంబర్ 2025 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

శిథిల వంతెనలు

పాములపాడు వద్ద దోసపాడు ఛానల్‌పై శనివారం కుప్పకూలిన వంతెన

- కొత్త వాటికి రూ.33.30 కోట్లు, మరమ్మతులకు రూ.11.33 కోట్లతో ప్రణాళికలు
- ఏడేళ్లుగా నిధులు విడుదల చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

రహదారులు భవనాల శాఖ (ఆర్ అండ్ బి) రహదారులపై శిథిల వంతెనలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ రహదారులపై రవాణా ప్రమాదకరంగా మారింది. జిల్లాలో 38 నూతన వంతెనల నిర్మాణానికి, మరో 59 వంతెనల మరమ్మతులకు సంబంధిత శాఖ పంపిన నివేదికలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఏడేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో సమస్య తీవ్రతరమవుతోంది.

ఏడేళ్లుగా నిధులు నిల్ !

ఆర్అండ్‌బి శాఖ పరిధిలో పెదపారుపూడి మండలం పాములపాడు వద్ద దోసపాడు చానల్‌పై ఉన్న వంతెన ఇటీవల కుప్పకూలింది. ఆ సమయంలో వంతెనపైగా వెళుతున్న టిప్పర్ లారీ దోసపాడు ఛానల్‌లో పడిపోయింది. వాహన డ్రయివర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. జిల్లా కేంద్రం మచిలీపట్నం నుంచి మొవ్వ వెళ్లే రోడ్డులో చినముత్తేవి, కాజ వద్ద రెండు వంతెనలు కూలిపోయి నాలుగేళ్లయింది. ఈ రెండు ప్రాంతాల్లో వాహనాలు రవాణాకు అనుగుణంగా తాత్కాలికంగా ఇనుపగడ్డర్లను అమర్చారు. ఈ మూడు వంతెనలు మాత్రమే కాదు...జిల్లాలో మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో వంతెనలు కూలిపోయాయి. 1 మేజర్, 29 మైనర్ వంతెనలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఈ 38 నూతన వంతెనల నిర్మాణానికి రూ. 33 కోట్ల 30 లక్షల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎనిమిది మేజర్ వంతెనల మరమ్మతులకు రూ. 2 కోట్ల 10 లక్షలు, 51 మైనర్ వంతెనల నిర్మాణానికి 9 కోట్ల 23 లక్షలు అవసరమని జిల్లా అధికారులు ఈ ఏడాది అంచనాలను రూపొందించారు. ఏడేళ్లుగా ఏటా వంతెనల నిర్మాణాలకు పంపుతున్న ప్రతిపాదనలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

వంతెనలు నిర్మిస్తారా..?

ఆంధ్రప్రదేశ్ పేరుతో జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వాలు బృహత్ ప్రణాళికలను రూపొందిస్తున్నాయి. వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా, ఇతర రంగాల్లో ఏటా 15 శాతం వృద్ధి సాధించాలని అధికారులు చెబుతున్నారు. ఆయా రంగాల్లో ఉత్పత్తులు ఆ మేరకు పెరగనున్నాయి. (మిగతా 2లో)

మహాసభలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

రైతుల్ని దగా చేస్తున్న ప్రభుత్వాలు

ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-గుడివాడ

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ద్రోహం చేస్తున్నాయని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య విమర్శించారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ భవనంలోని రుద్రరాజు సత్యనారాయణరాజు ప్రాంగణంలో ఎపి రైతు సంఘం కృష్ణా జిల్లా 46వ మహాసభ ఆదివారం జరిగింది. తొలుత సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.కేశవరావు రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభకు కోసూరి శివ నాగేంద్రం, కూనసాని రాంబాబు అధ్యక్షత వహించారు. బంటుమిల్లి మెయిన్ కాల్వకు పక్కనే ఉన్న 35 వేల ఎకరాలకు దాళ్వాకు అనుమతి ఇవ్వాలని, డ్రైనేజీ, ఆక్వా సమస్యలను (మిగతా 2లో)

శివనాగేంద్రరావు, నాగేశ్వరావు

నూతన కమిటీ ఎన్నిక

ఎపి రైతు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులుగా కోసూరి శివనాగేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా లంకదాసు అజయ్‌ఘోష్, కొలుసు శ్రీమన్నారాయణ, సహాయ కార్యదర్శిగా వక్కలగడ్డ శివశంకరరావు, యద్ధనపూడి మధుతో పాటు 23 మంది జిల్లా కమిటీకి ఎన్నికయ్యారు.

అమరావతి బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:

అమరావతి బాలోత్సవం 8వ పిల్లల పండుగ పోస్టర్‌ను విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు మాట్లాడుతూ డిసెంబర్ 9, 10, 11 తేదీల్లో విజయవాడ మొగల్‌రాజపురం సిద్ధార్థ కళాశాలలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'పర్యావరణాన్ని కాపాడుకుందాం... మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం' అనే థీమ్‌తో బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల సందర్భంగా ఇచ్చే అంశాల్లోను, నిర్వహణలోనూ పర్యావరణం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అకడమిక్, కల్చరల్ అంశాలలో 60 పోటీలు జరుగుతాయని, 2 నుండి 10వ తరగతి వరకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని 200 స్కూళ్ల నుండి 15 వేల మంది విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొంటున్నారని చెప్పారు. బాలోత్సవ నిర్వహణకు నగరంలోని సాహితీవేత్తలు, చిత్రకారులు, విద్యావేత్తలు, రంగస్థల ప్రముఖులు, నృత్య శిక్షకులు, కవులు, రచయితలు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, వివిధ రంగాల్లో నిష్ణాతులుగా ఉన్న 200 మంది ఆర్గనైజర్లుగా, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ నెల17వ తేదీ నుండి పది దళాలుగా 600 పాఠశాలలకు బాలోత్సవం బ్రోచర్స్ అందించనున్నట్లు చెప్పారు. తరగతి గదిలో సిలబస్, పరీక్షలు, మార్కులు ఒత్తిడిలో ఉన్న విద్యార్థులు చదువుతో పాటు ఇతర అంశాల్లో వారి ప్రతిభను, శక్తి సామర్థ్యాలు ప్రదర్శించేందుకు బాలోత్సవం వేదిక కానుందన్నారు. పిల్లలు సమగ్రంగా ఎదగాలని కోరుకునే ప్రతి ఒక్కరికీ బాలోత్సవం ఒక మంచి అవకాశమన్నారు. ఈ సమావేశంలో బాధ్యులు ఎన్.విద్యాకన్నా, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, వై సుబ్బారావు, కె వెంకట్, యువి రామరాజు, లెనిన్‌బాబు, జి.నారాయణరావు, టి.క్రాంతి పాల్గొన్నారు.

వచ్చే నెల చివరి వరకు సాగునీరు

- 1700 టిఎంసిల అదనపు నీరు దిగువకు మళ్లింపు
- పంటల సాగుకు 130 టిఎంసిలు వినియోగం
- ఇరిగేషన్ ఎస్ఇ మోహన్‌రావు

ప్రజాశక్తి-విజయవాడ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో వివిధ రకాల పంటల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వచ్చే నెల చివరి వరకు కెనాల్స్‌కు నీటిని విడుదల చేయడం జరుగుతుందని ఇరిగేషన్ సర్కిల్ విజయవాడ పర్యవేక్షక ఇంజినీర్ (ఎస్ఇ) ఆర్.మోహన్‌రావు పేర్కొన్నారు. వచ్చే నెల చివరి నాటికి 75 శాతంకు పైగా వరి కోతలు పూర్తవుతాయని, 2026 జనవరిలో మిగిలిన వరి కోతలు పూర్తవుతాయని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు గత జూన్ 10న ఇరిగేషన్ కాలువలకు నీటిని విడుదల చేయగా, ఆయా ప్రాంతాల పంటల పరిస్థితి, వాటి అవసరాలకనుగుణంగా కెనాల్స్‌కు వచ్చే నెల వరకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సాగునీటి వ్యవస్థ తదితర అంశాలపై ఎస్ఇ 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: కెనాల్స్‌కు సాగునీటిని ఎప్పటి వరకు విడుదల చేస్తారు?

జవాబు: ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆయా పంటల పరిస్థితి, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే నెల చివరి వరకు కెనాల్స్‌కు నీటిని విడుదల చేయడం జరుగుతుంది. గత జూన్ మాసంలో కెనాల్స్‌కు నీటిని విడుదల చేశాం. ఈ ఏడాది సాగునీటికి ఎటువంటి ఇబ్బంది ఎదురుకాలేదు.

ప్రశ్న: కృష్ణాడెల్టా ఆయకట్టు పరిధిలో ఎన్ని లక్షల ఎకరాలకు సాగునీటిని అందించారు?

జవాబు: ప్రకాశం బ్యారేజి పరిధిలోని ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలోని 7 లక్షల 30 వేల ఎకరాల్లోని వివిధ రకాల పంటల సాగుకు సాగునీటిని అందించడం జరిగింది. ముఖ్యంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో 5 లక్షల 60 వేల ఎకరాలకు సాగునీటిని అందించడం జరిగింది.

ప్రశ్న: ఇటీవల సంభవించిన మొంథా తుఫాను ప్రభావం ఏ మండలాల పరిధిలో ఎక్కువగా ఉంది?

జవాబు: బంటుమిల్లి, కృత్తివెన్ను, చల్లపల్లి, గూడూరు, మచిలీపట్నం, పెడన తదితర మండలాల పరిధిలోని వరి, ఇతర వాణిజ్య పంటలపై మొంథా తుఫాను ప్రభావం ఎక్కువుగా ఉంది. దిగుబడిపై తీవ్రమైన ప్రభావం పడింది. 20 శాతంపైగా దిగుబడిపై ప్రభావం చూపుతుంది. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉన్న మండలాల పరిధిలో ఎకరాకు 20 బస్తాలలోపే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మిగిలిన మండలాల్లో (మిగతా 2లో)

కార్మికుని కుటుంబానికి పరిహారం 2వ పేజీ

జరీబు రైతుల్లో ఆందోళన 2వ పేజీ

కార్మికుని కుటుంబానికి పరిహారం

• కాంట్రాక్ట్ సంస్థతో సిఐటియు చర్చలు • రూ.10 లక్షలు ఇచ్చేందుకు అంగీకారం

ప్రజాశక్తి-విజయవాడ: విద్యుత్ షాక్‌కు గురై ప్రమాదవశాత్తు మృతిచెందిన కాంక్రీట్ కార్మికుడి కుటుంబానికి సిఐటియు నాయకులు అండగా నిలిచారు. కాంట్రాక్ట్ సంస్థ యాజమాన్యంతో సిఐటియు నాయకులు ఎన్.నాగేశ్వరరావు, ఎం.బాబూరావు, ఎన్.శ్రీనివాస్ ఆదివారం చర్చలు జరిపి కార్మికుని కుటుంబానికి పరిహారం ఇప్పించారు. విజయవాడ స్వరాజ మైదానంలో కొత్తగా నిర్మాణం జరుగుతున్న కన్వెన్షన్ సెంటర్ టెర్రస్‌పై షీల్డ్ కాంక్రీట్ వర్క్ చేస్తున్న పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామనికి చెందిన కటికల యేసు (24) విద్యుత్ షాక్‌తో శనివారం ప్రమాదవశాత్తు మరణించాడు. విషయం తెలుసుకున్న తండ్రి కటికల శ్రీను, కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కాంట్రాక్ట్ సంస్థ యాజమాన్యంతో కార్మికుడి కుటుంబ సభ్యులు మాట్లాడినా ప్రయోజనం లేకపోవడంతో సిఐటియు నేతలను ఆశ్రయించారు. దీంతో భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు నేతలు కాంట్రాక్ట్ సంస్థ యాజమాన్యంతో చర్చలు జరిపారు. కార్మికుని కుటుంబానికి కాంట్రాక్ట్ సంస్థ యాజమాన్యం రూ.10 లక్షలు ఆర్థిక సహాయం, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఇచ్చేందుకు అంగీకరించింది. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి యేసు మృతదేహాన్ని తరలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, బాబూరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నేటి కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా

కార్మికులను మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బివి రాజు, బి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన మంచినీటి పైపులైన్లు

ప్రజాశక్తి-వత్సవాయి: ఇటీవల కురిసిన వర్షాలకు వరద రావడంతో లింగాల మునేరు బ్రిడ్జిపై పైపులైన్లు కొట్టుకుపోయాయి. దీంతో వత్సవాయి, శీను నాయక్ తండ, డబ్బాకుపల్లి, గంగవల్లి పోచవరం, లింగాల తదితర గ్రామాలకు మంచినీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మరో మార్గం లేక మినరల్ వాటర్‌ను తెచ్చుకుంటున్నారు. ప్రతి సంవత్సరం అకాల వర్షాలకు వరంగల్, హనుమకొండ, ఖమ్మం తదితర జిల్లాల నుంచి వచ్చే వరద ఈ బ్రిడ్జి మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. మే నెలలో అధికారులు టెండర్లు పిలిచి 1.50 కోట్లతో బ్రిడ్జిని పునర్నిర్మించారు. ఇటీవల వచ్చిన వరదలకు మంచినీటి పైపులైన్లు దెబ్బతిని కొట్టుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పైప్‌లైన్ల సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొదటిపేజీ తరువాయి

శిథిల వంతెనలు

మరోపక్క మచిలీపట్నంలో ఓడరేవు, ఫిషింగ్ హార్బర్‌తో పాటు ఇతర ప్రభుత్వ, ప్రయివేటు భవన నిర్మాణాలు పెరిగాయి. క్రమంగా రవాణా వాహనాల రద్దీ రోడ్లపై పెరుగుతోంది. ఈ క్రమంలో ఆర్ అండ్ రహదారులు, వాటిపై ఉన్న వంతెనలను ముందుగా రవాణాకు సిద్ధంగా నిర్మించడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది.

రైతుల్ని దగా చేస్తున్న ప్రభుత్వాలు

పరిష్కరించాలని, మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మహాసభలో తీర్మానించారు. సభలో కృష్ణయ్య మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అందరూ వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ద్రోహం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైనాలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ ప్రజలకు ఆకలి బాధ లేకుండా చేస్తున్నారన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం స్వామి నాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తూ అతి పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల చివరి వరకు సాగునీరు

కూడా దిగుబడి తగ్గే అవకాశం లేకపోలేదు.

ప్రశ్న: ఈ వర్షాకాలంలో అదనపు నీటిని ఎంత మేర దిగువకు విడుదల చేశారు?

జవాబు: ప్రకాశం బ్యారేజి నిర్మించిన తరువాత రికార్డు స్థాయిలో సర్‌ప్లస్ వాటర్ దిగువకు విడుదల చేయడం ఇది మూడో సారి. నమోదు అయిన రికార్డు ఆధారంగా 1975-76లో సంభవించిన వరదలకు ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు 2600 టిఎంసిల వాటర్‌ను దిగువకు విడుదల చేయగా, 1964-65లో 2,500 టిఎంసిలు, అలాగే ప్రస్తుతం (2025-26)లో వచ్చిన వరదలకు దిగువకు 1700 టిఎంసిల నీటిని దిగువకు విడుదల చేయడం జరిగింది.

ప్రశ్న: కెనాల్స్‌కు ఎన్ని టిఎంసిల నీటిని విడుదల చేశారు?

జవాబు: ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో ఈ ఖరీఫ్‌లో వరి పంటతో పాటు మిగిలిన వివిధ రకాల పంటల సాగు కోసం 130 టిఎంసిల నీటిని కెనాల్స్‌కు విడుదల చేయగా, సర్‌ప్లస్ వాటర్ ద్వారా సుమారు 17 లక్షల ఎకరాల సాగుకు నీటిని అందించవచ్చు. ఒక టిఎంసి వాటర్ పది వేల ఎకరాల సాగుకు సరిపోతుంది.

'సంతాన ప్రాప్తిరస్తు' చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

విజయవాడ నగరంలో సంతాన ప్రాప్తిరస్తు చిత్ర బృందం సందడి చేసింది. ఈనెల 14న విడుదల అయిన ఈ చిత్రం విజయవంతం కావడంతో ప్రేక్షకులను నేరుగా కలిసి కృతజ్ఞతలు తెలిపేందుకు జయరాం థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని వీక్షించారు. అనంతరం హీరో విక్రాంత్ మాట్లాడుతూ సంతాన ప్రాప్తిరస్తు చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. విడుదలైన అన్ని కేంద్రాలలో ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. సాఫ్ట్వేర్ ఉద్యోగి తన స్పెర్మ్ కౌంట్ పెంచుకునేందుకు పడే పాటులను దర్శకుడు కామెడీ యాంగిల్ లో తీసిన విధానానికి ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారని పేర్కొన్నారు. తమ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులను కలుసుకొని వారికి కతజ్ఞతలు చేపట్టేందుకు విజయ యాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఈ సినిమా విజయం తనకెంతో ఆనందాన్నిచ్చిందని ఇదే స్పూర్తితో మరిన్ని మంచి చిత్రాలలో నటించి ప్రేక్షకులను మెప్పించే విధంగా ప్రయత్నం చేస్తానని తెలియజేశారు. అనంతరం హీరోయిన్ చాందిని చౌదరి మాట్లాడుతూ సంతాన ప్రాప్తిరస్తు చిత్రం ఒక డీసెంట్ కామెడీ డ్రామా అని అందుకే కుటుంబ సమేతంగా తమ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షిస్తున్నట్లు చెప్పారు. ఎమోషనల్ సన్నివేశాలు కూడా ప్రేక్షకులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయని అన్నారు. ఈ చిత్రం కోసం తమ టీం అంతగానో కష్టపడి పని చేసిందని ఆ కష్టానికి ప్రేక్షకుల నుంచి ప్రతిఫలం రావడం ఆనందంగా ఉందన్నారు.

ఫ్లిప్‌కార్ట్ జీరో కమిషన్ మోడల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

స్వదేశీ ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, రూ.వెయ్యి కంటే తక్కువ ధర ఉన్న ఉత్పత్తులకు జీరో కమిషన్ మోడల్‌ను ప్రవేశపెట్టడంతో దాని సెల్లర్ రేట్ కార్డ్‌కు ఒక ముఖ్యమైన మెరుగుదలను ప్రకటించిందని ఫ్లిప్‌కార్ట్ మార్కెట్ ప్లేస్ హెడ్ సకైత్ చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ అమ్మకాలను మరింత సమ్మిళితంగా, వద్ధికి దారితీసేలా చేయాలనే దాని నిరంతర నిబద్ధతకు అనుగుణంగా, ఈ మోడల్ వ్యయ నిర్మాణాలను సులభతరం చేస్తుంది అని తెలిపారు., సరసమైన ధరలను ప్రోత్సహిస్తుంది. దేశవ్యాప్తంగా చిన్న , మధ్యతరహా వ్యాపారాలకు ఫ్లిప్‌కార్ట్ విలువ ప్రతిపాదనను మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. రేటు కార్డులో ఈ వ్యూహాత్మక అభివద్ధి ఫ్లిప్‌కార్ట్ యొక్క హైపర్‌వాల్యూ ప్లాట్‌ఫామ్ అయిన షాప్సీని శక్తివంతంగా ప్రభావితం చేసిందన్నారు. జీరో కమిషన్ మోడల్ ఇప్పుడు షాప్సీలోని అన్ని ఉత్పత్తులకు విస్తరించబడిందని తెలిపారు. ధరతో సంబంధం లేకుండా, హైపర్‌వాల్యూ విభాగాన్ని లక్ష్యంగా చేసుకుని విక్రేతలకు కీలకమైన సహాయకుడిగా దాని స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుంది అని, కస్టమర్లకు స్థోమతను పెంచుతుందని అన్నారు.

జరీబు రైతుల్లో ఆందోళన

• మెట్ట భూములంటూ ప్యాకేజీ తగ్గింపు • పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-తుళ్లూరు: నిమ్మ, అరటి తదితర పంటలను భూసమీకరణ ద్వారా రాజధాని నిర్మాణానికి 2014-15 మధ్య టిడిపి ప్రభుత్వం తీసుకుంది. ఈ భూములను జరీబుగా పరిగణించి కౌలు ఎకరాకు రూ.50 వేలు చెల్లించారు. కొంతకాలం తరువాత జరీబు భూములు కాదని, మెట్ట భూములంటూ కౌలును రూ.30 వేలకు తగ్గించారు. జరీబు భూములకు నివాస ప్లాట్లు వెయ్యి గజాలు, కమర్షియల్ ప్లాట్లు 450 గజాలు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాల్సి ఉండగా మెట్ట భూములకు ఇచ్చే నివాస ప్లాట్లు వెయ్యి గజాలు, కమర్షియల్ 250 గజాలు తీసుకోవాలని చెప్పారు. దీంతో తాము తీవ్ర ఆందోళనకు గురయ్యామని, ఇప్పటివరకు ఎన్నోసార్లు ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకూ పరిష్కారం కాలేదని రాజధాని రైతులు వాపోతున్నారు.

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం కృష్ణా నదీ తీర ప్రాంత గ్రామాలైన బోరుపాలెం, అబ్బరాజుపాలెం, రాయపూడి, కంఠమరాజు కొండూరు గ్రామాలకు చెందిన రైతులు నిమ్మ, అరటి, కంద తదితర పంటలను పండిస్తారు. ప్రభుత్వం జరీబు భూముల నిర్ధారణకు కొన్ని అంశాలను ప్రామాణికంగా తీసుకుంది. భూములు కృష్ణానదీ తీర ప్రాంతంలో ఉండటం, 20-30 అడుగుల లోతులో నీటి లభ్యత, భూముల్లో బోర్లు ఉండటం, ఏడాదికి మూడు పంటలు పండటం లాంటి అంశాలను పేర్కొంది. ఇందుకనుగుణంగా వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సర్వే చేశారు. కృష్ణానదీ తీరంలోని వెంకటపాలెం, లింగాయపాలెం, మందడం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, బోరుపాలెం, అబ్బరాజుపాలెం తదితర గ్రామాల్లోని సుమారు ఆరు వేల ఎకరాల్లో సర్వే చేసి జరీబు భూముల జాబితాను రూపొందించారు. అధికారులు నిర్ధారించిన భూములకు జరీబు ప్యాకేజి ప్రకారం ప్లాట్ల కేటాయింపు, కౌలు చెల్లించారు. కొంతకాలం తరువాత రాయపూడి, బోరుపాలెం, అబ్బరాజుపాలేనికి చెందిన సుమారు 150 ఎకరాలను జరీబు

బోరుపాలెంలో నిమ్మతోట (ఫైల్ ఫొటో)

భూములు కాదని, మెట్ట భూములని అధికారులు చెప్పడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మెట్ట భూములంటూ ఇచ్చిన కౌలును తిరస్కరించి తమకు న్యాయం చేయాలని ఆందోళన బాట పట్టారు. నిరసనలు, నిరాహారదీక్షలు, వినతిపత్రాలు అందజేశారు. కళ్లెదుట నిమ్మ తోటలు, వాటిలో బోర్లున్నా జరీబు భూములు కాదని ఎలా అంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వం హయాంలో సమస్య పరిష్కారం కాలేదని, వైసిపి ప్రభుత్వంలో సరేసరి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా పరిస్థితిలో మార్పు లేదని, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
సోమవారం 17 నవంబరు 2025

యార్లగడ్డ కుటుంబరావు మృతికి నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక నేత యార్లగడ్డ కుటుంబరావు(82) మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చల్లపల్లి ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య కలరు. చిన్న కుమారుడు ఆస్ట్రేలియాలో ఉంటున్నారు. కుటుంబారావు భౌతికకాయాన్ని స్వగ్రామమైన చల్లపల్లి మండలం నడకుదురు పంచాయతీ శివారు నాదెళ్లవారిపాలెంకు తీసుకొచ్చారు. కుటుంబరావు జమిందార్ మిగుల భూముల పోరాటంలో పాల్గొన్నారు. గ్రామంలో సిపిఎం బలోపేతానికి కృషి చేశారు. కమ్యూనిస్టు పార్టీ అభిమానులు నాయకులు గ్రామానికి ఎవరు వచ్చినా కుటుంబ సభ్యులు ప్రేమతో ఆహ్వానించి ఆశ్రయం కల్పించేవారు. చల్లపల్లి మండలంలో ఏ కార్యక్రమం జరిగిన చురుకుగా పాల్గొనే వారు. ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ కార్మిక పోరాట ంలో చురుగ్గా పాల్గొనేవారు. అంత్యక్రియలు సోమవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబరావు భౌతికదేహాన్ని సీనియర్ నేత వెనిగళ్ళ వసంత సందర్శించి అరుణ పతాకం కప్పి అరుణాంజలి ఘటించారు.

కుటుంబరావు మృతికి పలువురు సంతాపం

కుటుంబరావు అకాల మరణం పట్ల పలువురు సిపిఎం నేతలు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య, సిపిఎం కేంద్ర కమిటీ ఎస్ పుణ్యవతి, మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు, చల్లపల్లి మండల కార్యదర్శి యద్దనపూడి మధు, కల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ మహమ్మద్ కరిముల్లా, వంగల సుబ్బారావు,చల్లపల్లి మండల కమిటీ సభ్యులు లంకపల్లి సత్యనారాయణ, బండారు కోటేశ్వరరావు, బళ్ళ వెంకటేశ్వరరావు,షేక్ ముంతాజ్ బేగం, మేడేపల్లి వెంకటేశ్వరరావు, తలారి నాగేశ్వరరావు, కుంపటి బాబురావు, నంద్యాల ప్రభ తదితరులు సంతాపం ప్రకటించారు.

19న ఉప్పెన మృతుల సంస్మరణ సభ : ఎంఎల్ఎ

మాట్లాడుతున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 19వ తేదీన 1977 దివిసీమ ఉప్పెన మృతుల 48వ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఆదివారం తమ కార్యాలయంలో శత జయంతి కమిటీల ప్రతినిధులు, కూటమి నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ గాంధీ క్షేత్రం ఆవరణలో గాంధీ క్షేత్ర కమిటీ, మండలి వెంకటకృష్ణారావు శతజయంతి కమిటీ ఆధ్వర్యంలో మానవతామూర్తులకు దివ్య వందనం సమర్పించే ఉద్దేశంతో ఈ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 19వ తేదీ ఉదయం 10 గంటలకు గాంధీ క్షేత్రంలో జరిగే ఈ సభకు ముఖ్యఅతిథిగా మాజీ గవర్నర్, దీన దయాళపురం గ్రామ నిర్మాణ కర్త బండారు దత్తాత్రేయ గౌరవ అతిథులుగా, రాష్ట్ర గనుల, ఎక్సైజ్ శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర, రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు. పార్థసారథి, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని. బాలశౌరి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వై. శ్రీనివాసరావు తదితరులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి-పామర్రు : పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి తోడ్పడుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిదికొత్త పెదమద్దాలి గ్రామంలో ఆదివారం పళ్లెం కమలమ్మకి 51,098 రూపాయల చెక్కును, చెరుకుమిల్లి ఆంజనేయులు కు 15,000 రూపాయల చెక్కును, చిట్టూరి వివేక్ కి 75,610 రూపాయల సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులను ఎంఎల్ఎ వారి గృహాలకు వెళ్లి అందజేశారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కేదరాశి పల్లి శ్రీను, ప్రచార కార్యదర్శి చాట్ల పెద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయంలో ఎస్పి పూజలు

ప్రజాశక్తి- మోపిదేవి : మోపిదేవిలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సిఐడి ఎస్పీ చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. దేవస్థానానికి విచ్చేసిన చక్రవర్తికు ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్‌రావు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.

విక్కుర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు : మోపిదేవి మండల పరిధిలోని పెదకళ్ళేపల్లి గ్రామంలో ఉన్న దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవాలయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు విశేష పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో విక్కుర్తి శ్రీనివాస్, విజయలక్ష్మి దంపతులు, విక్కుర్తి రాంబాబు, సుహాసిని దంపతులు, పెదప్రోలు పిఎసిఎస్ చైర్మన్ నాదెళ్ళ శరత్ చంద్రబాబు దంపతులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు,

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని ఘంటసాల, కొడాలి శ్రీకాకుళం శాఖా గ్రంథాలయాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఘంటసాలలో పాలిటెక్నిక్ విద్యార్థినీ విద్యార్థులకు ఎం శరత్‌కుమార్ వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కొడాలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథాలయ అధికారి యం సుబ్బారావు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయంలో ఉన్న పుస్తకములను చదవటం ద్వారా పఠనాశక్తి పెంచుకోవచ్చని గ్రంథాలయాధికారి అన్నారు. **ప్రజాశక్తి-పామర్రు :** జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ స్థాపనకు కృషి చేసిన పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్యకు గ్రామ ప్రముఖులు వల్లభనేని వేణుగోపాలరావు నివాళి అర్పించారు. ఆనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం,పోటీలు నిర్వహిం చారు. గ్రంథాలయ అధికారివి.నాగ సురేష్,మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి తదితరుల పాల్గొన్నారు.అదేవిధంగా పామర్రు లోని గ్రేడ్ 2 శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన,డ్రాయింగ్ పోటీలు నిర్వహించి మొక్కలు నాటారు. హితం పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ నందపాటి హేమంత్ రెడ్డి,గ్రంథాలయ అధికారిని ఎం.ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు శాఖా గ్రంథాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయ ఉద్యమ నాయకులైన అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరు నాగభూషణం గ్రంథాలయాలు కోసం చేసిన కృషిని కోడూరు గ్రంథాలయ శాఖ అధికారిణి యార్లగడ్డ పుష్పలత వివరించారు. అనంతరం విద్యార్థులకు చెస్, క్యారమ్స్, కబడ్డీ ఆట పోటీలను నిర్వహించారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గ్రంథాలయ ఉద్యమాలలో పాల్గొన్న ప్రముఖుల గురించి జీ నరసింహారావు వివరించారు. అలాగే జూనియర్ విద్యార్థులకు లెమన్ స్పూన్ పోటీలు, సీనియర్ విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించినట్లు గ్రంథాల అధికారిని వి వాణి తెలిపారు.**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ శాఖ గ్రంథాలయంలో ఆదివారం మూడవ రోజు పద్మశ్రీ అవార్డు గ్రహీత గ్రంథాలయ వ్యవస్థాపకులు అయ్యంకి వెంకటరమణయ్య జీవిత చరిత్ర, ఆయన చేసిన సేవలు గూర్చి విద్యార్థిని విద్యార్థులకు వివరించి అనంతరం విద్యార్థిని విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో విశ్వశాంతి, శ్రీ చైతన్య, ఎస్ ఎం కె జిల్లా పరిషత్ హై స్కూల్, ఎంపీయుపి స్కూల్, ఇమ్మానుయేలు మిషన్ స్కూల్, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. బాల బాలికలు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం, న్యూస్ పేపర్ చదివితే మంచి విజ్ఞానవంతులు అవుతారని గ్రంథాలయ అధికారిని టి కృష్ణకుమారి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) :** గన్నవరం, ముస్తాబాద లలో ఆదివారం మూడవ రోజు గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి పలువురు ఉపన్యాసాలు ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. కాకుమాని శ్రీనివాసరావు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మడుపల్లి బాలకష్ణ, న్యాయవాది తిరువీధి వెంకయ్య, గ్రంథాలయ అభివద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు, ముస్తాబాద గ్రందాలయాధికారి జ్యోతి కుమారి విద్యార్థులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి సింహాద్రి పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని వర్తమాన సాహిత్యం పై మాట్లాడి అమ్మ కవితను చదివి వినిపించారు. జి సూర్యనారాయణ బంగారు బాల్యం అన్న అంశంపై కవిత్వం చెప్పారు. మనసే మందిరం అనే అంశంపై దివి ఝాన్సీ, స్మార్ట్ ఏలియన్ అంశంపై జి మాల్యాద్రి కవితలు చదవగా స్థానిక గాయకుడు కె. చంద్రశేఖర్ ఆడవారిపై అత్యాచారాలు పై పాటను రాగయుక్తంగా పాడి వినిపించారు. గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని మేడూరు గ్రంథాలయ శాఖ అధికారి బొబ్బ లావణ్య అన్నారు. ఆదివారం మండలంలోని పమిడిముక్కల, పెనుమచ్చ, గురజాడ, అగ్నిపర్రు గ్రంథాలయాల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పమిడిముక్కల గ్రంథాలయాధికారి షరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో...

కోడూరులో...

క్రికెట్ ప్రాక్టీస్ నెట్ ఏర్పాటు

ముదావహం : సత్తిబాబు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గ్రామీణ ప్రాంత యువతలో క్రికెట్‌లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రాక్టీస్ నెట్స్ ఏర్పాటు ముదా వహమని అదనపు ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మోకా సత్తిబాబు అన్నారు. మండలంలోనిలోని కూరాడ మెయిన్ రోడ్ ప్రక్కన పెద్దిరెడ్డి శ్రీనివాసరావు, రూపేష్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "క్రికెట్ ప్రాక్టీస్ నెట్స్" ను అడిషనల్ ఐజి ఆఫ్ పోలీస్ మోకా సత్తిబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం సత్తిబాబు మాట్లాడుతూ కేవలం వ్యాపార దక్పథంతో మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంత యువత దష్టిని క్రీడలవైపు మళ్ళించడానికి క్రికెట్ ప్రాక్టీస్ నెట్స్" ఏర్పాటు చేసినపెద్దిరెడ్డి శ్రీనివాస్ కుటుంబం, ఆత్మీయులు చేస్తున్న కషి సఫలీకతం కావాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు పెద్దిరెడ్డి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, సుమమాల అధ్యక్షులు షాలేమ్ రాజు, సీనియర్ అంబేద్కరిస్ట్ మత్తే నాగరాజు, లయన్స్ అధ్యక్షులు మేరుగు పెరుమాళ్ళు పాల్గొన్నారు.

కొండలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. సుమారు 5 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. అలాగే గుడివాడ కాకర్ల వీధికి చెందిన ఎన్.ఎల్.వి నరసింహారావు సుమారు 34,600 రూపాయల విలువగల 246 గ్రాముల వెండి కిరీటాన్ని అమ్మవారికి బహుకరించారు. వారికి దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే.మోహన్ ఆలయ మర్యాదలకు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రములతో సత్కరించారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక పాటిమీద జగన్నాథపురంలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తుల అన్నసమారాధనకు పదివేల విరాళం అందించినట్లు ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం తలనీలాలు సమర్పించిన, దూర ప్రాంత భక్తులకు నిర్వహించే అన్న సమారాధనకు లక్ష్మీనరసింహపురంకు చెందిన కూన కష్ణారావు జ్ఞాపకార్థం వారి సతీమణి కూన లక్ష్మీ రూ.10 వేల రూపాయలు శాశ్వత అన్నదాన పథకానికి విరాళంగా అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న దృశ్యం

వనసమారాధనలు ఐక్యతకు చిహ్నాలు

• ఎంపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కార్తీక మాసంలో ప్రజలందరూ ఒక చోట కలిసి భోజనం చేయటం ఐక్యతకు చిహ్నమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నగరాల యువజన సంఘం ఆధ్వర్యంలో జక్కంపూడి పాములకాలవ దగ్గర నగరవనం అటవీ శాఖ పార్క్ ప్రాంగణంలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన చిన్నారుల నృత్య ప్రదర్శనను కేశినేని శివనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీకేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరాల వనసమారాధనలో పాల్గొనటం ఎంతో ఆనందంగా వుందన్నారు. నగరాల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నగరాల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయిన వెంకన్న, ప్రధాన కార్యదర్శి వి.శ్రవణ్ కుమార్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గూడెల మణికంఠ, సంఘం నాయకులు రాయన అరుణ్ కుమార్, దుర్గగుడి మెంబర్ సుఖాసి సరిత, ఏపీ నగరాల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లు సుఖాసి కిరణ్, బేవర సాయి సుధాకర్, పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, చిట్టినగర్ దేవస్థానం సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, క్రీడలు మన జీవితంలో భాగం కావాలని శ్రీ శ్రీనివాస్ గ్రావిటీ విద్యా సంస్థల చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో శ్రీ శ్రీనివాసా గ్రావిటీస్ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు 800 మందికి పైగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను చైర్మన్ శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుల ఒత్తిడికి గురి కాకుండా వారికి మానసిక ఉల్లాసం కోసం క్రీడలు అవసరమని అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, వాటిని క్రీడా స్ఫూర్తితో తీసుకొని ముందుకెళ్లాలని తెలిపారు. శ్రీ శ్రీనివాసా గ్రావిటీస్ కళాశాల ప్రిన్సిపాల్ వి.ఫణి రాజు కుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులను ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీనివాసా గ్రావిటీస్ కళాశాల డైరెక్టర్ పరుచూరి నీలిమ, అకడమిక్ డైరెక్టర్లు ఎం.వి.సత్యనారాయణ రెడ్డి, టి.సురేష్ బాబు, కె.సతీష్ పాల్గొన్నారు.

జర్నలిస్టులు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం:జర్నలిస్టులు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని, అందుకు అనుగుణంగా నిజాయితీతో జర్నలిజం చేయాలని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు తెలిపారు. ఆదివారం జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పత్రికా సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా విస్తృతంగా మారి నిజమేదో అబద్ధం ఏదో తెలియకుండా వార్తలు వస్తున్నాయని, జర్నలిజం అంటే సమాజాన్ని ప్రభావితం చేసేదిగా ఉండాలని అన్నారు. అన్ని వ్యవస్థలు జర్నలిస్టులు రాసే వార్తల తోనే ప్రభావితం అవుతాయని అందుకు అనుగుణంగా మార్గదర్శకులుగా జర్నలిస్టులు మారాలని కోరారు. జర్నలిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లా ఆదినారాయణ, సాంబశివరావు, మహబూబ్ సుభాని, ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బి.డేవిడ్ రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాషా,నాగరాజు, క్రాంతి కుమార్, హఫీజ్ ఖాద్రీ, మురళి, రహీం, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఫలితాలు ప్రకటన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గృహోపకరణాల్లో వినియోగదారు ఎలక్ట్రానిక్స్‌లో నంబర్ వన్ భాగస్వామిగా ఉన్న ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ ఫలితాలు ప్రకటించిందని సంస్థ ప్రతినిధి ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. క్యూ2ఎఫ్ వై25లో రూ.61.14 బిలియన్ల కార్యకలాపాలు ద్వారా కంపెనీ ఆదాయాన్ని అందించిందని తెలిపారు. ఇది క్యూ2ఎఫ్ వై26లో రూ.61.74 బిలియన్ల కార్యకలాపాలు ద్వారా వచ్చిందని తెలిపారు. సవాలుతో కూడిన వాతావరణం ఉన్నప్పటికీ, ఎల్జీ స్థిరమైన ఉన్నతమైన వృద్ధిని నమోదు చేసిందని, రానున్న కాలంలో కూడా మంచి ఫలితాలను సాధించగలమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

టాటా ఎఐజి ఇన్సూరెన్స్ సైబర్ ఎడ్జ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ సాధారణ బీమా సంస్థల్లో ఒకటైన టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, స్టార్టప్‌లు, ఎమ్ ఎస్ఎమ్ఇలను పెరుగుతున్న సైబర్ దాడులు, డేటా ఉల్లంఘనల ముప్పు నుంచి రక్షించడానికి సైబర్ ఎడ్జ్‌ను ప్రారంభించినట్లు సంస్థ ఇంచార్జి నజ్మా తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాలలో సైబర్ బీమా పోర్ట్‌ఫోలియో తమ మొత్తం ఫైనాన్షియల్ ప్రీమియంలో దాదాపు 25 శాతం వాటాను అందిస్తుందని తెలిపారు. అదే సమయంలో ఈ ప్రాంతంలో 2 రెట్ల వ్యాపార వృద్ధిని సాధించడాన్ని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. "సైబర్ ముప్పు విస్తృతి అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. సైబర్ ఎడ్జ్‌తో, ఇక్కడి వ్యాపారాలు తమ రక్షణలను బలోపేతం చేసుకోవడానికి, వేగంగా స్పందించడానికి, చాకచక్యంగా కోలుకోవడానికి వీలు కల్పిస్తున్నామని తెలిపారు.

కార్పొరేటర్లు, అధికారులు కలిసి పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్పొరేటర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచించారు. తాడిగడపలోని తన క్యాంపు కార్యాలయంలో కూటమి కార్పొరేటర్లు, అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా పశ్చిమంలో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుధ్యం, తదితర అభివృద్ధి పనులతో పాటు టిడ్కో ఇళ్ల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. డివిజన్లో ఇప్పటికే నిర్మాణ దశలో ఉన్నటువంటి అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాల పురోగతిని కార్పొరేటర్లు వీఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు కార్పొరేటర్లు కలిసికట్టుగా శ్రమించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ డి చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ కె సత్యవతి, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె శ్రీనివాస్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్, కూటమి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. విశ్రాంతి ఆచార్యులు అబ్బాస్ ఆలీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ వడ్డేపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారగ్రహీత సరికొండ నరసింహ రాజు, కవి బత్తుల బ్రహ్మయ్య, అద్దంకి సుధాకరరావు, పర్సా శ్రీనివాసరావు, రంగస్థలం కళాకారులు పి.రమణ రావు, శ్రీ కళ వేదిక కార్యదర్శి కొండ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి మస్తాన్ వలి వందన సమర్పణ చేశారు.

21 నుంచి భవానీ అర్ధమండల దీక్షలు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీ విశ్వవసు నామ సంవత్సర అర్ధమండల దీక్షలు 21వ తేదీ శుక్రవారం ప్రారంభం కానున్నాయని ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. 25వ తేదీ మంగళవారం వరకు మాల ధారణలు స్వీకరించేలా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీక్షలు స్వీకరించే ముందు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద దీక్షలు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కామధేను అమ్మవారి ఆలయంతో పాటు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద దీక్షలను ఆలయ అర్చకులు చేతుల మీదుగా స్వీకరిస్తారని పేర్కొన్నారు. డిసెంబర్ 4న మార్గశిర పౌర్ణమి కలశజ్యోతి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. సత్యనారాయణపురంలోని శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి సాయంత్రం 6.30 గంటలకు ప్రత్యేక వాహనంపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కలశజ్యోతులతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారని పేర్కొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం విజయవాడ రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ సందర్శించారు. జగ్గయ్యపేట, చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు, దౌర్జన్యాలకు పాల్పడితే చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జగ్గయ్యపేట ఎస్సై జి రాజు ఉన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-కంచికచర్ల : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కంచికచర్ల గ్రంథాలయంలో మూడో రోజు ఆదివారం విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ఆవశ్యకత అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి వి.అమరేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం ఎస్సార్ రంగనాథన్‌లను స్మరిస్తూ వారి చిత్ర పటాలకు పలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవి, డ్రాయింగ్ టీచర్ నీలం సర్వేశ్వరరావు, కార్ల్ మార్క్స్, బాజీఖాన్, ఇస్మాయేలు, ఎస్కే అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని వన సమారాధన కార్యక్రమం ఆదివారం బలుసుపాడు రోడ్డు అనఘా టౌన్‌షిప్‌లోని మామిడి తోటలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హాజరై మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజం ఎప్పటికప్పుడు సమాజాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు ముందుండే మహోన్నత సంప్రదాయాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. కార్తీక వనసమారాధన వంటి కార్యక్రమాలు ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తీసుకురావడమే కాకుండా యువతలో సేవాభావం, సంస్కారవంతమైన ఆలోచనలను పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శివశ్రీ గంటేల వెంకటరమణ (గురువు) దంపతులు, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, శ్రీరాం సాయి ప్రసాద్, శ్రీరాం చిన్నబాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిని కలిసిన లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఎంపీ కేశినేని శివనాథ్ ను ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన యేదుపాటి వెంకట రమణి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో తన భర్త టిడిపి ఎన్టీఆర్ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ యేదుపాటి రామయ్య తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ కు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన యేదుపాటి రామయ్య, వెంకటరమణిలను శాలువాతో ఎంపీ కేశినేని శివనాథ్ సత్కరించి అభినందనలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యేర్నేని వేదవ్యాస్, నరసింహాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, డివిజన్ ప్రధాన కార్యదర్శి పచ్చవ మల్లికార్జున పాల్గొన్నారు.

కొండపల్లిలో గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి శాఖా గ్రంథాలయంలో 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం జూనియర్స్ (6,7 తరగతులకు) వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమాజంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత అనే అంశంపై సీనియర్స్ (8,9,10) విద్యార్థినీ,విద్యార్థులకు సమాజంలో నేటి యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాల నుండి విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పి కామేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు ఏ నరసింహరాజు, పాఠకులు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రంథాలయ అధికారి డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విజయ డెయిరీ అభివృద్ధికి 'మండవ' విశేష కృషి

- జానకీరామయ్య సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : పాడి రైతుల సంక్షేమం, విజయ డెయిరీ అభివృద్ధే లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డైరీ) మాజీ చైర్మన్ మండవ జానకి రామయ్య అహర్నిశలు శ్రమించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. గన్నవరంలోని ఎస్ఎం కన్వెన్షన్ హాల్లో ఆదివారం కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డైరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన జానకి రామయ్య సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. ఆర్థిక ఒడిదుడుకులతో ఉన్న సంస్థను లాభాల బాటలోకి నడిపించిన ఘనత జానకీరామయ్యకే దక్కుతుందన్నారు. సంస్థ అభివద్ధి కోసం ప్రారంభించిన ప్రతి పనిని, ఎదురైన అవరోధాలను లెక్కచేయకుండా, పూర్తి అయ్యే వరకు నిరంతరం శ్రమించేవారని వక్తలు తెలిపారు. సంస్థ లాభాల్లోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు, రైతులకు బోనస్‌లను పంపిణీ చేశారని, సంవత్సరంలో మూడు సార్లు రైతులకు బోనస్ ఇవ్వడం ఒక గొప్ప విషయమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా మండవ జానకి రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 'క్షీర విప్లవ సారధి-ఆంధ్ర కురియన్ మండవ జానకిరామయ్య' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీ.హెచ్. రాజేశ్వరరావు, సీబీఎన్ ఆర్మీ వ్యవస్థాపక అధ్యక్షుడు మానం బ్రహ్మయ్య, యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, మండవ వాసు, జానకి రామయ్య కుమారుడు వెంకటరత్నం, కష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఏ బుద్ధప్రసాద్

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి సహకారం : బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానాన్ని అభివద్ధి చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తానని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం పులిగడ్డ ఇరిగేషన్ అతిథి గృహం వద్ద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. అందుకోసం మౌలిక వసతులు ఎంతో అవసరమని సంబంధిత అధికారులతో చర్చించి క్రీడా ప్రాంగణ అభివద్ధికి చర్యలు తీసుకుంటా మన్నారు. అదేవిధంగా ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేసేందుకు సహకరిస్తానని బుద్ధ ప్రసాద్ హామీ ఇచ్చారు. అదేవిధంగా కష్ణ నది కరకట్టలను కూడా అభివద్ధి చేసి రబ్బీస్ రోడ్డు వేసినట్లయితే వాకింగ్ చేసుకోవడానికి అవి కూడా ఎంతో ఉపయోగప డతాయని బుద్ధ ప్రసాద్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ అవనిగడ్డలోని ప్రధానంగా ఉన్న గుర్రపు చెరువు చుట్టూ ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా పట్టణంలో కొంతమంది సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన వాకింగ్, సైక్లింగ్, బ్యాక్ వాకింగ్, రన్నింగ్, పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్ బి కే ట్రస్ట్ కన్వీనర్ సనక. చూటే, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పర్చూ రి. రాఘవేంద్రరావు, కార్యదర్శి కొండవీటి. మురళి, ట్రెజరర్, వడ్లమూడి శశి కుమార్, కోడూరి ఎంఈఓ టి ఎస్ ఎం రామదాసు, మోపిదేవి ఎంఈఓలు జి. ఎన్. బి గోపాల్, రమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయల నిధులతో రోడ్లు డ్రైనేజీ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఆదివారం తాడిగడప గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ నుండి ఎస్‌టిబిఎల్ కాలనీ వరకు 1 కోటి 15 లక్షల రూపాయల నిధులతో ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్డును విస్తరించి అభివద్ధిన రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోడ్డును విస్తరించి అభివద్ధి చేయడం ద్వారా వాహనదారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ రోడ్డు ఊరి చివరి వరకు విస్తరించి అభివద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పామర్రు-గుడివాడ రహదారి

ప్రమాదకరంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి-పామర్రు : పామర్రు నుండి గుడివాడ వెళ్లే జాతీయ రహదారి ప్రమాదాలకు నిలియంగా మారింది. ఇప్పటికే ఈ రోడ్డుపైన పలు ప్రమాదాలు జరగగా పలువురు గాయాలు పాలైయ్యారు.ఒకరు మరణించారు.ఈ రహదారి ఎన్నో రోజులుగా చీకటి మయంగా ఉంటుంది.రోడ్డు విస్తరణలో భాగంగా ఈ రోడ్డును విస్తరించారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన ఉన్న పాత విద్యుత్తు లైన్లను పక్కకు జరిపి కొత్త లైను వేశారు. ఈ ప్రక్రియ జరిగి రెండు నెలలు కావస్తున్నా కొత్తగా వేసిన విద్యుత్ స్తంభాలకు లైట్లను అమర్చలేదు. రోడ్డు విస్తరణ కాంట్రాక్టర్ గాని స్థానిక పంచాయతీ అధికారులు గానీ దీనిని ఇప్పటివరకు పట్టించుకోలేదు. దీని కారణంగా పామర్రు కొండిపర్రు రోడ్డు నుండి ఊరు చివరన ఫ్లైఓవర్ వరకు గుడివాడ వెళ్లే రహదారి చీకటి మయంగా మారింది. దీనికి తోడు రోడ్డు విస్తరణ పనులు సగంలోనే ఆగిపోయాయి. సుమారు 40 అడుగులు రోడ్డు వెడల్పు ఉండగా అందులో సగం మాత్రమే తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. మిగిలిన సగభాగం లావు కంకర పరచి వదిలేశారు. ఈ కారణంగా వచ్చే పోయే వాహనాలు సగం వేసిన రోడ్డుపైనే ఎదురు ఎదురుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించుకోవటానికి పక్కనే ఉన్న కంకర లోకి వెళ్లిన వాహనదారులు జారీ పడిపోతున్నారు. మళ్లీ తిరిగి తారు రోడ్డు ఎక్కాలంటే రోడ్డు అంచు వల్ల ఇబ్బంది పడుతున్నారు. అసలే చీకటిమయం అందులోనూ అసంపూర్ణంగా వేసిన రోడ్డు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో అని ఈ రోడ్డు వెంబడి వెళ్లేవాళ్లు భయపడుతున్నారు.సంబంధిత అధికారుల తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 17వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ హాలులో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం కార్యక్రమం జరుగు తుందని, అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయా లలో కూడా అందజేయవచ్చున్నారు. మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చున్నారు.

విమానాశ్రయంలో సుప్రీంకోర్టు సిజెకు వీడ్కోలు

వీడ్కోలు పలుకుతున్న న్యాయమూర్తులు, అధికారులు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మంగళగిరిలోని కార్యక్రమాన్ని ముగించుకుని పుట్టపర్తి (మహారాష్ట్ర) తిరిగి వెళ్లేందుకు విమానాశ్రయానికి చేరుకోగా న్యాయమూర్తులు, అధికారులు వీడ్కోలు పలికారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపి, జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ, జిల్లా పోలీసు అధికారి ఎస్పీ వీ. విద్యాసాగర్ నాయుడు, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావులు జస్టిస్ గవాయ్ కు వీడ్కోలు పలికారు.

మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయ బ్లడ్ బ్యాంక్‌లో మినీ రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. రేర్ (నెగటివ్) బ్లడ్ గ్రూపుల లభ్యత కష్టతరం అవుతున్న నేపథ్యంలో అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేందుకు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులతో భాగస్వామ్యాన్ని బలపరచడం లక్ష్యంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 11 మంది స్వచ్ఛంద దాతలు రక్తదానం చేశారు. గరాల దిబ్బ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటేశ్వరరావు (గరాల దెబ్బ నాని) ఆధ్వర్యంలో యువకులు పాల్గొన్నారు. మైత్రి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఆర్కే వరప్రసాద్ నాని తో కలిసి రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్, ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్, గౌరవ సభ్యులు సుధీంద్ర కుమార్ పాల్గొన్నారు.

బిఆర్ అంబేద్కర్ పోరాట పటిమ ఆదర్శణీయం : సత్తిబాబు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : అత్యంత వెనుకబడిన వర్గాలలో పుట్టిన వ్యక్తుల్ని సైతం ఉన్నతశిఖరాలపై కూర్చోబెట్టిన ఘనత డా.బి ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానిదేనని అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ మోకా సత్తిబాబు అన్నారు. ఆదివారం మచిలీపట్నం మండలం లోని మంగినపూడి గ్రామంలో డా.బి ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ నిమ్న వర్గాల అభ్యున్నతికి, సామాన్యులకు స్వేచ్ఛనివ్వడం కోసం అంబేద్కర్ అహర్నిశలు శ్రమించారన్నారు. విద్య, ఉద్యోగాలు, సామాజిక న్యాయం, రాజకీయ అవకాశాలు కల్పించడం కోసం అంబేద్కర్ రాజ్యాంగ రచన సమయంలో ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ ఇంకా చాలా కుటుంబాలు పేదరికంలో, సామాజికంగా ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు షాన్ రేంజర్ల రాజేష్, ప్రముఖ అంబేద్కరిస్ట్ మత్తె నాగరాజు, రేవ.ఫాదర్ రవిశాస్త్రి, రేవ. ఫాదర్ అగస్టిన్, జల్లుల రవి, వంపుగొడవల చౌదరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మోకా సత్తిబాబు

వెంకటేశ్వర స్వామి వైభవోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వైభవోత్సవాలు ఘనంగా ఆదివారం ప్రారంభం అయ్యాయి. వైభవోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ శ్రీనివాస కళ్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు మహాక్షేత్రం నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, పీ నాగిరెడ్డి, ప్రసన్న దంపతులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విష్వక్సేనారాధన , పుణ్యాహవాచనం, స్నపన తిరుమంజనం, 108 కళాశాలతో అభిషేకం, విజయ శాంతి హెూామం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీ ప్రసన్న, వెంకటేశ్వరరెడ్డి తదితరులతో పాటు డోకిపర్రు గ్రామా ప్రజలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ మండలం అవురుపూడి గ్రామం లో విశ్వ మానవ సంక్షేమ సంఘం, కృష్ణా జిల్లా కష్ణ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పెసల మస్తాన్ రావు, కష్ణా చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ కీర్తి గ్రామ ప్రజలు పిల్లలు పాల్గొన్నారు. ట్యూషన్ టీచర్ శైలజ, గ్రామ వాలీబాల్ యూత్, బాలబాలికలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాయకాపురంలో

'హెల్తీ విజయవాడ రెగ్యులర్ మెడికల్ క్యాంప్

విజయవాడ : షుగర్, బిపి, ఫిట్స్, పక్షవాతం తదితర రోగులకు సేవలందించేందుకే ప్రజా ఆరోగ్య వేదిక (జన్ స్వాస్థ్య అభియాన్ అనుబంధం), జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హెల్తీ విజయవాడ రెగ్యులర్ మెడికల్ క్యాంప్

నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. హెల్తీ విజయవాడ రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం పాయకాపురం లహరి విద్యా మందిర్ ప్రాంగణంలో నిర్వహించారు. సుమారు 200 మంది షుగర్, బిపి, ఫిట్స్, పక్షవాతం రోగులు వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు రెండు నెలలకు సరిపడిన మందులను కేవలం రూ.200లకే నిర్వాహకులు అందించారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, హెల్తీ విజయవాడ మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్ జి. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి ప్రజలందరూ ఈ మెడికల్ క్యాంపును వినియోగించుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో డాక్టర్ బి శ్రీహర్ష, డాక్టర్ చావా మురళీకృష్ణ, మెడికల్ విద్యార్థులు హష్మీ, భార్గవ్ తేజ, శ్రీకర్ వైద్య సేవలందించారు. మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్లు ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి విజయ్ ప్రకాష్, జనవిజ్ఞాన వేదిక నగర కార్యదర్శి వి.శ్రీనివాస్ సమన్వయం చేశారు.

కల్లుగీత కార్మిక సంఘం

మాజీ నేత ఆంజనేయులు మృతి

విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న కల్లుగీత కార్మిక సహకార పరపతి సంఘం మాజీ కార్యదర్శి ఆరేపల్లి ఆంజనేయులు (65) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. నాలుగు రోజల క్రితం ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో విజయవాడ నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు ఆయనకు చికిత్స చేస్తుండగా శనివారం అర్థరాత్రి తర్వాత ఆయనకు గుండెపోటు వచ్చింది. దీంతో వైద్యులు ఆయనను ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచి చికిత్స చేస్తుండగా ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం, ప్రభుత్వం నుంచి పింఛన్ సౌకర్యం కోసం ఉమ్మడి కష్ణాజిల్లాలో ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వహించిన అనేక పోరాటాలలో ఆంజనేయులు చురుకుగా పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మచిలీపట్నం, ఖమ్మం, హైదరాబాద్‌లో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం మహాసభలు, పోరాటాలలో ఆంజనేయులు పాల్గొన్నారు. గీత కార్మిక సంఘం పోరాట ఫలితంగానే గీత కార్మికులు గత కొన్నేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి పింఛన్ పొందుతున్నారు. ఆంజనేయులు మృతి వార్త తెలియడంతోనే పలు గ్రామాలకు చెందిన కల్లుగీత కార్మిక సంఘం నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తులు ఉన్నారు. కుమార్తెలు ఇరువురికి వివాహాలు చేశారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

ప్రజాశక్తి-మైలవరం : ఎందరో ప్రముఖులు చేసిన గ్రంథాలయ ఉద్యమం వలన గ్రంథాలయాలు ఏర్పడ్డాయని ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎపి లైబ్రరీ అసోసియేషన్ కృష్ణాజిల్లా వైస్ ప్రెసిడెంట్, గ్రంథ పాలకుడు డాక్టర్ టి సాంబశివరావు అన్నారు. మైలవరం శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా విద్యార్థులు గ్రంథాలయాలు వినియోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు బిపిఎస్

ప్రజాశక్తి- నందిగామ : అక్రమ నిర్మాణాలకు ప్రభుత్వం జిపిఎస్ ప్రకటించడంతో 22 నుంచి దరఖాస్తుల స్వీకరణకు మున్సిపల్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. బిపిఎస్ ద్వారా నందిగామ మున్సిపాలిటీకి సుమారు రూ.4 కోట్లకుపైగా ఆదాయం సమకూరనుంది. రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాల్లో అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం బిల్డింగ్ పీన లైజేషన్ స్కీం (బీపీఎస్) అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 22 నుంచి దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీలోపు నిర్మించిన అక్రమ కట్టడాలను ఇందులో క్రమబద్ధీకరిస్తారు. నందిగామ పురపాలక సంఘం పరిధిలో సుమారు 200 వరకు అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ప్రభుత్వం బీపీఎస్‌ను తీసుకు రావడం వల్ల సంబంధిత యజమానులు వీటిని రెగ్యులర్ చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. నందిగామ రైతుపేట, నెహ్రూనగర్, రామలింగేశ్వర నగర్, రైతుపేట డౌన్, ప్రధాన రోడ్లల్లో బహుళ అంతస్తులు అక్రమంగా నిర్మించారు. చివరికి అపార్టుమెంట్లలోనూ షాపింగ్ కాంప్లెక్సు నిర్మించారు. ఇప్పటికీ అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగు తున్నాయి. ఇంటింటి సర్వే ద్వారా గుర్తింపు అక్రమ

నిర్మాణాలను పట్టణ ప్రణాళిక, వార్డు సచివాలయ సిబ్బందితో ఇంటింటికి సర్వే చేసి గుర్తిస్తారు. ఈ నెల 22 లోపు దరఖాస్తులను ఆన్‌లైన్లో గుర్తింపు పొందిన ఎల్టీపీల ద్వారా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ. బీపీఎస్.ఏపీ.జీవోవీ.ఇన్లో సమర్పించాలి. ఎల్‌పీల ద్వారా దరఖాస్తు చేసేందుకు 120 రోజుల్లోపు రూ.10 వేలు చెల్లించాలి. దరఖాస్తులు అనంతరం నిర్మాణాల్లో మార్పులు చేస్తే ఎన్టీపీలపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. అదే విధంగా నేరుగా బీపీఎస్లో దరఖాస్తు చేసినా తప్పు చేసినట్లు గుర్తించి బిల్డర్. డెవలపర్లను బ్లాక్లో పెడతారు. కమిషనర్ లోవరాజు మాట్లాడుతూ బీపీఎస్ ను భవన యజ మానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా ఉల్లాసంగా

ప్రజాశక్తి - తిరువూరు : సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పీటీ కొత్తూరులోని మామిడి తోటలో నిర్వహించిన వనసమారాధన సందడిగా జరిగింది. ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, జనవిజ్ఞాన వేదిక నాయకుల పర్యవేక్షణలో కులమతాలకతీతంగా మహిళలు, పురుషులు, పిల్లలు సైతం పాల్గొని వివిధ రకాల ఆటలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కుర్చీలాట, మోకు లాగుట, కబడ్డీ, డాన్స్ వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సత్య నర్సింగ్ హెూమ్ డాక్టర్ తేజ, జ్యోతి నర్సింగ్ హెూమ్ వైద్యులు వల్లభనేని రవీంద్రలు షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఆరోగ్య సూత్రాలను వివరించారు. ప్రజా సంఘాల నాయకులు ఎం.నాగేంద్రప్రసాద్, ఎస్.కుమారి, హరికృష్ణ, కె.పాపారావు, బి.వెంకటేశ్వరరావు, ఏ.రవి, పి.శ్రీనివా సరావు, ఏం.చింతయ్య, ఎస్. కె.నాగుల మీరా, చప్పిడి సురేష్ తదితరులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

చెరుకు పైరుకు

ఆకతాయిలు నిప్పు

ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు మండలం నరసింహారావు పాలెం గ్రామానికి చెందిన జంగా సాంబశివారెడ్డి జుజ్జు రెవెన్యూ పరిధిలోని చెరుకు పంటకు ఆదివారం మధ్యాహ్నం ఆకతాయిలు నిప్పుపెట్టారు. దీంతో చెరుకు పైరు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు రైతు సాంబశివారెడ్డి వాపోయారు. పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

'మద్దులమ్మ'కు జలకళ

ప్రజాశక్తి-కంచికచర్ల : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామ పరిధిలోని మద్దులమ్మ దేవాలయం వద్ద యాత్రీకుల సందడి నెలకొంది. కార్తీకమాసం చివరి ఆదివారం కావటంతో కంచికచర్ల, వీరుపాడు మండలాల నుండే కాకుండా విజయవాడ, మంగళగిరి, గుంటూరు, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల నుండి ప్రత్యేక వాహనాల్లో వందలాది మంది యాత్రీకలు తరలిరావటంతో మద్దులమ్మ దేవాలయం, మద్దులమ్మ లోయ వద్ద సందడి వాతావణం నెలకొంది. ఆలయం వద్ద పాలు, పొంగళ్లు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. వంటా వార్పు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. కొండపై నుండి దిగువకు వస్తున్న జలపాతంలోకి యువతీ, యువకులు దిగి కేరింతలు కోడతూ సరదాగా గడిపారు. అయితే అటవీ ప్రాంతంలో దేవాలయం వద్ద సరైన సౌకర్యాలు లేకపోవడం, అపరిశుభ్రంగా ఉండడం, పిచ్చి మొక్కలు పెరిగి ఉండడంతో



పర్యాటకులు కాస్త అసౌకర్యానికి గురయ్యారు. మద్దులమ్మ దేవాలయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా వనమారాధన

ప్రజాశక్తి-మైలవరం : రెడ్డి సేవా సంఘం మైలవరం ఆధ్వర్యంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని వన సమారాధనం కార్యక్రమం ఆదివారం స్థానిక వివేకానంద గార్డెన్స్‌లో ఉత్సాహంగా జరిగింది. ముందుగా ఇటీవల మతి చెందిన గోగుల మోడీ సత్యనారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముగ్గురు పేద విద్యార్థులకు చదువు నిమిత్తం ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రవాస ఆంధ్రులు ఎన్నారై డాక్టర్ లక్కిరెడ్డి హనీమిరెడ్డి మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్లు అప్పిడి సత్యనారాయణ రెడ్డి, వజ్రాల కుమార్ రెడ్డి, గంజి కృష్ణారెడ్డి, పి రాజారెడ్డి, సిహెచ్ బాలగోపాల్ రెడ్డి, జెడ్ నాగిరెడ్డి, శీలం నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జ్యూడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్

అధ్యక్షులుగా రంగనాయక్

ప్రజాశక్తి-మైలవరం : ఎన్టీఆర్ జిల్లా జ్యూడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా రంగనాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మైలవరం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది బుద్ధారపు వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జ్యూడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా జ్యూడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించగా ఆ సమావేశంలో మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ బాణావత్ రంగనాయక్ 82 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఆయన తెలిపారు. రంగనాయక్‌ను మైలవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు పలువురు అభినందించారు.

తిరుపతమ్మ గాజుల సంబరం

ప్రజాశక్తి-వత్సవాయి : కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని ఆదివారం గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం పల్లగిరి గ్రామంలోని అమ్మ గార్డెన్స్‌లో నూరు భాషా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, నూరు భాషా సంఘం చైర్మన్ షేక్ నాగుల్ మీరా ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ.. సంఘాలు సమాజ నిర్మాణానికి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

వక్తృత్వం పోటీల్లో విజేతలకు

బహుమతులు

ప్రజాశక్తి- నందిగామ : గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వక్తృత్వం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయం అధికారి రామచంద్రుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా రూపేష్ యాదవ్, మురళి కృష్ణ, బ్రహ్మయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రాజ గోపాల్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

కారు దగ్ధం

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండలం కీసర సమీపంలో ప్రమాదానికి గురైన కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జగకపోవటంతో పెద్ద ప్రమాదం పప్పింది. హైదరాబాద్ నుండి విజయవాడకు ఇద్దరు వృద్ధ దంపతులు కారులో వస్తున్నారు. ఆదివారం మద్యాహ్నం 3 గంటల సమయంలో కీసర టోల్ గేటు దాటగానే కారు టైరు పేలి ముందు వెళ్తున్న బైక్‌ను, ట్యాకర్‌ను ఢీ కొడుతూ గొయ్యిలోకి దూసుకెళ్లింది. దీంతో ఒక్కసారిగా కారు ఇంజన్లో నుండి మంటలు చెలరేగాయి. స్థానికులు, టోల్ సిబ్బంది గమనించి కారులో ఉన్న దంపతులను బయటకు తీసుకొచ్చి రక్షించారు. అగ్నిమాపక సిబ్బంది కారులో మంటలను అదుపు చేశారు.

టిడిపి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కార్యకర్తల బలంతో నడిచే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్తానిక నియోజక వర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన మచిలీపట్నం పట్టణ, రూరల్ అధ్యక్షులు, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. తొలుత బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణ రావుతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అరంతరం అక్కడ నుండి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో పట్టణ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, రూరల్ మండల అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, లంకె నారాయణప్రసాద్ , హసీం బేగ్, పట్టణ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు వేమూరి సాయి, ప్రధాన కార్యదర్శి బచ్చుల అనిల్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు అంబల్ల గోవింద్, మహమ్మద్ కరీముల్లా , జిజ్జువరపు రమేష్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

ప్రజాశక్తి-కంచికచర్ల : వావివరసలు మరచి వరుసకు చెల్లి అయిన మైనర్‌ను ప్రేమ పేరుతో నమ్మించి గర్భవతిని చేసిన సంఘటన మండల కేంద్రమైన కంచికచర్లలో చోటుచేసుకుంది. కంచికచర్ల ఎస్ఐ పి.విశ్వనాథ్ అందించిన వివరాల మేరకు.. కంచికచర్లకు చెందిన 17 సంవత్సరాల బాలికపై కంచికచర్ల ఇందిర కాలనీకి చెందిన ఊపుతల శ్రీనివాస్ అనే యువకుడు గత కొంతకాలంగా ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి గర్భవతిని చేశాడు. ఇటీవల బాలిక కడుపునొప్పితో బాధపడుతూ తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వైద్య పరీక్షలు చేయించగా అసలు విషయం బయటపడింది. బాధితురాలు శ్రీనివాస్‌కు వరుసకు చెల్లెలవుతుందనే విషయం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఈ విషయమై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచికచర్ల పోలీసులు శ్రీనివాస్‌పై ఫోక్సో కేసు కేసు నమోదు చేశారు. నందిగామ ఏసీపి కేసును దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం నిందితుడిని కోర్టులో హాజరు పెడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

120 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-మొవ్వ : మండల పరిధిలోని కూచిపూడి-పెదపూడిలోని వర్తక సంఘ కళ్యాణ మండపంలో ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ ఆధ్వర్యంలో సమత శంకర్ నేత్ర చికిత్సాలయం వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మొవ్వ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు బెల్లంకొండ వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి కూచిపూడి, పెదపూడి, పెడసనగల్లు, అయ్యంకి, కారకంపాడు, మరియు చినముత్తేవి సుధీర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చిన 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 24 మంది పేషెంట్స్ కి క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయుటకు నిర్ధారణ జరిపి వీరిని ఉయ్యూరులో ఆపరేషన్ చేయనట్లు డాక్టర్ శరణ్య తెలిపారు. అనంతరం మందులు అవసరం ఉన్నవారికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమతా శంకర నేత్రాలయం ఉయ్యూరు సిబ్బంది రాజ్ కుమార్ (అప్తో), అనిల్ కుమార్ (ఆర్గనైజేషన్), రెడ్ క్రాస్ సొసైటీ బెల్లంకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ధాన్యం పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు రాకుండా చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం పాలంకిపాడు గ్రామంలో వరికోతలు కోసి ధాన్యం విక్రయిస్తున్న రైతులను అటువైపు వెళుతూ ఆగి ధాన్యం రాశులను పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా ఆదివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రతి వరి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ధాన్యంను ఆరబెట్టి తేమశాతం తగ్గించుకుంటే మంచి గిట్టుబాటు ధర వస్తుందని రైతులకు సూచించారు. రైతులతో పాటు ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపి రైతులను ఉత్తేజపరిచారు. ధాన్యం కొనుగోలు, తేమశాతం విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే రైతు సేవ కేంద్రంను సంప్రదించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మద్యం, డ్రగ్స్ నిర్మూలించాలని ర్యాలీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : విశ్వ మానవ సంక్షేమ సంఘం, కష్ణ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక 15వ వార్డులో చిన్నారులు ర్యాలీ నిర్వహించారు సందర్భంగా సంస్థల ప్రతినిధులు "మద్యం నియంత్రిద్దా-డ్రగ్స్ ని అరికడదాం" అనే నినాదాలు చేశారు. సందర్భంగా విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మస్తాన్ రావు మాట్లాడుతూ నేటి యువత మద్యానికి, డ్రగ్స్ కి బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించా లని డిమాండ్ చేశారు. డ్రగ్స్ మద్యం నిర్మూలించకపోవడంతో రోజురోజుకీ వ్యసనానికి గురైన యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, ఇతరులపై దాడులు చేయటం గాయపరచడం, మద్యం మత్తులో, గంజాయి మత్తులో ప్రాణాలను తీస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం 15వ వార్డులో విద్యార్థుల సౌకర్యార్థం కష్ణ చిల్డ్రన్స్ క్లబ్‌ఆధ్వర్యంలో నూతనంగా అల్లూరి సీతారామరాజు ట్యూషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కష్ణ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ బి. కీర్తి, ట్యూషన్ టీచర్ మల్లేశ్వరి, వార్డు సభ్యులు లక్ష్మి, చిన్నారులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై పేరుకుపోయిన ఇసుక

జాతీయ రహదారిపై ఇసుకతో ఇబ్బందులు

ప్రజాశక్తి- నందిగామ : విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై పాత కంచల క్రాస్ రోడ్డు వద్ద ఇసుక పేరుకుని ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. జాతీయ రహదారి పక్కన ఇసుక పేరుకుపోవటం వల్ల ప్రజలకు ప్రమాదకరంగా మారింది. పాత కంచల వద్ద మునేటి నుంచి నిత్యం టిప్పర్లతో ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ సమయంలో జారిపడిన ఇసుక జాతీయ రహదారిపై పేరుకుంది. ఇసుకను తొలగించక ద్విచక్ర వాహన చోదకులు జారి పడుతున్నారు. నిత్యం విజయవాడ వైపు నుంచి నందిగామ వైపు వందలాది మంది ద్విచక్ర వాహనాలపై రాకపో కలు సాగిస్తుంటారు. జాతీయరహదారి - 65 అధికారులు స్పందించి ఇసుకను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - తిరువూరు : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సంద ర్భంగా ఆదివారం తిరువూరు గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో సబ్ జూనియర్స్‌కు, జూనియర్స్‌కు, సీనియర్స్‌కు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మత్తు పదార్థాల ప్రమాదంపై వక్తలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ స్కూల్ చిత్రలేఖనం ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కె.నాగభూషణం, గ్రంథాలయ అధికారిణి పద్మ పాల్గొన్నారు.

మహాసభ జయప్రదం చేయాలని కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి- తాడేపల్లి : ఈనెల 23, 24 తేదీల్లో తాడేపల్లి జరిగే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని బ్రహ్మానందపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల మీద చర్చించి, వాటికి రూపకల్పన చేసి, భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపట్టేందుకు సాగుతున్న ఈ జిల్లా మహాసభలకు ఆతిధ్యాన్ని ఇస్తున్న తాడేపల్లి కమిటీ కి అభినందనలు తెలిపారు. ఈ ప్రాంత వాసులు అందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించి ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ సిమెంట్ కంపెనీ కార్మికుల సమస్య గత 33 సంవత్సరాలుగా పరిష్కారం లభించలేదని, యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి 1070 మంది కార్మికులు చనిపోయి, అనేకమంది కార్మికులు అలమటిస్తున్నా, అనారోగ్య పాలవుతున్నా పట్టించుకున్న నాథుడు లేడని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సిమెంట్ కంపెనీ సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సిమెంట్ కంపెనీ కార్మిక పోరాటానికి సిఐటియు అన్నివేళలా ఎసిసి కార్మికులకు అండదనలు ఇస్తుందని, వారు నిర్వహించబోయే పోరాటాలకు ప్రత్యక్షంగా సిఐటియు పాల్గొంటుందని ఆయన హామీ ఇచ్చారు. 23వ తేదీన తాడేపల్లిలో జరిగే కార్మిక ప్రదర్శన బహిరంగ సభకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని దుర్గారావు కోరారు.ఈ కార్యక్రమంలో కె.స్టీవెన్, ఎం.దుర్గారావు, సాంబయ్య, నాగేశ్వరరావు, సూర్యప్రకాష్, దుర్గాభవాని, రమాదేవి, నవనీతం, హిమాంబి,మల్లేశ్వరి, గురవయ్య, బాషా, జానీ, సుభాని, అక్కయ్య, ఆశీర్వాదం, సుబ్బారావు, శారద తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల కార్తీక వనసమారాధనలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన ఘనంగా నిరహించారు. ఏజీఅండ్ఎస్‌జిఎస్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో ఆటల పోటీల్లో విజేతలు, నత్యప్రదర్శన చేసిన చిన్నారులకు అసోసియేషన్ జిల్లా గవర్నర్ సనక సుబ్బారావు, ఎలక్ట్ గవర్నర్ లోయ ఈశ్వరవెంకటేశ్వరరావు బహు మతులు అందజేశారు. అసోసియేషన అధ్యక్షుడు కోడె సాంబశివరావు, శ్రీనివాస్,రాము, డాక్టర్ తిరుమలరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** దివిసీమకు చెందిన ఎరువులు, పురుగుమందుల కంపెనీల్లో పనిచేసే సిబ్బంది ఆదివారం హంసలదీవి డాల్ఫిన్ భవనం వద్ద కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని దివి ఫీల్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఉమ్మనేని సాయిబాబు, విసంశెట్టి పున్నారావు, తోట సాయిబాబు, కొండవీటి సురేష్, ఆరె వరపు సోమేశ్వరరావు, తిరుమల శెట్టి బాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ :** మెకానిక్‌ల సంక్షేమానికి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సహకరించాలని యూనియన్ అధ్యక్షులు కొల్లా వెంకట సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నంలో మెకానిక్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు ఇవ్వాలని వన సమారాధనలో పాల్గొన్న అధికార పార్టీ నాయకులు దష్టికి తీసుకువచ్చారు. ఆదివారం బందర్ టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ కార్తీక వన సమారాధన ఐదు రోడ్ల సెంటర్లోని అన్నం వీరరాఘవయ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లావెంకట సుబ్బారావు, మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, జనసేన నాయకులు మాదివాడ రాము, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ మండలం ఎడ్లలంకలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడారు. టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, జనసేన ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు మత్తి .వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం)** దావాజిగూడెంలోని ఎస్.వి.ఆర్. కళ్యాణమండపం ప్రాంగణంలో ఆదివారం శ్రీ గాయత్రి ఆలయ ట్రస్ట్, బ్రాహ్మణ పరిషత్ వారి కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూరి బ్రాహ్మణ పరిషత్ గన్నవరం నియోజకవర్గ అధ్యక్షులు కె.వి.ఆర్. కిషోర్, బ్రాహ్మణ పరిషత్ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, కష్ణా జిల్లా బ్రాహ్మణ ప్రచార కార్యదర్శి పి.వి. పణి కుమార్, ఏ.ఆర్.కె. మూర్తి పాల్గొన్నారు. **ప్రజాశక్తి- నందిగామ :** నందిగామలోని నెహ్రూ నగర్ కమ్మ కళ్యాణ మండపంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షులు, కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. 140 మంది పేద విద్యార్థులకు మొత్తం రూ.14 లక్షల రూపాయలు స్కాలర్‌షిప్‌లు అందజేశారు.

బందరులో...

అవనిగడ్డలో...

అలరించిన తెలుగు కళారత్నాలు

విజయవాడ : ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు జరగనున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 'తెలుగు కళా రత్నాలు' (సాంస్కృతిక సేవా సంస్థ), 'ఉషోదయా ఫౌండేషన్' సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి స్థానిక ఠాగూర్ గ్రంథాలయంలో పలు సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి పలువురు కవులు స్వీయ కవితా పఠనం చేశారు. సంగీత విభావరి, పౌరాణిక ఏకపాత్రల అభినయం జరిగాయి. ప్రముఖ గాయకులు డాక్టర్ యు.వి.రత్నం, ధనాశి ఉషారాణి (సంస్థల అధినేతలు) నేతృత్వంలో జి.మంగరాజు, సునీత, హరికృష్ణ, చింతా రజిని తదితరులతో సినీ సంగీత విభావరి, కోటి నాగులు, కోటి, డా. బి.బూసిరెడ్డి తదితరులతో పౌరాణిక ఏకపాత్ర అభినయం, కారసాల సుగంధ, వి.వి.వి. కామేశ్వరి, డి.టి. హేమంత్ సింగ్, కె.శ్రీనివాస్, చోడవరపు రూపా, డా. నేలపూడి రామకష్ణ, శివలీలారెడ్డి, దండే స్వర్ణ మోహిని, ఈమని మల్లికార్జునరావు, సంకా శోభారాణి తదితరులతో కవితా పఠనం, అవిరినేని వెంకటేశ్వరరావు తదితరులు పద్య గానం ఉత్సాహంగా జరిగాయి. పాల్గొన్న సాహితీ, కళాకారులతోపాటు అతిథులుగా విచ్చేసిన రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ గోసాల మురళీకృష్ణ, ప్రముఖ అడ్వకేట్ హజరతయ్య గుప్తా, ఠాగూర్ గ్రంథాలయ అధికారి రమాదేవి, సీనియర్ పాత్రికేయుడు, కళాకారుడు జి.వి.రంగారెడ్డి తదితరులను కూడా నిర్వాహకులు సత్కరించారు.

గొద్రేజ్ ఆగ్రోవెట్ ఉత్పత్తుల విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వైవిధ్యభరితమైన ఆగ్రి-ఫుడ్ వ్యాపారాలలో ఒకటైన గొద్రేజ్ ఆగ్రోవెట్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒక నాన్-బైండింగ్ అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు సంస్థ ప్రతినిధి జె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన ఒప్పందం కింద కంపెనీ తన పాడి వ్యాపారంలో పాడి ప్రాసెసింగ్ విలువ జోడించిన ఉత్పత్తుల సామర్థ్యాలను విస్తరించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు ఏకైక పరిష్కార కేంద్రాలైన కొత్త సమాధాన్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి రూ.70 కోట్లు పెట్టుబడిగా పెట్టనుందని తెలిపారు. రానున్న రోజుల్లో కంపెనీ విస్తరణ జరుగనున్నదని అన్నారు.

మయోపియా కంటి వ్యాధిపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఎల్‌విపిఈఐ ఆధ్వర్యంలో మయోపియా కంటి వ్యాధిపై అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ర్యాలీలో పెనుమలూరు సిఐ జె.వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రకాలు వ్యాధులు పట్ల ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టడం శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కోడె వెంకటాద్రి చౌదరి క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసూయ గంగూలీ మాట్లాడుతూ పిల్లల నేత్ర సంరక్షణా వారోత్సవం మయోపియా అవగాహన ర్యాలీ ప్రతి సంవత్సరం ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాలలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ ఏడాది నవంబర్ 10 నుండి 16వ తేదీ వరకు పిల్లల నేత్ర సంరక్షణా వారోత్సవాలను నిర్వహించామన్నారు. పిల్లలలో మయోపియా వేగంగా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వారోత్సవాల సందర్భంగా అనేక రకాల పోటీలను, వినోదాత్మక కార్యక్రమాలను స్థానిక ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల, కోడే వెంకటాద్రి చౌదరి క్యాంపస్ వద్ద నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా రోగులకు, సిబ్బంది పిల్లలకు చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, వ్యాస రచన పోటీలు, స్కిట్స్, మయోపియా అవగాహన సంభాషణలు వంటి పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ఐక్యతకు చిహ్నం కార్తీక మాస స్నేహ సమ్మేళనం

● సిహెచ్. బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నున్న చిన్నకంచెలో కార్తీక మాసం స్నేహ సమ్మేళనం వనభోజనాల కార్యక్రమం ఆదివారం జరిగింది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఆట- పాటలతో పాటు నృత్య రూపకాలు ప్రదర్శించారు. అహ్లాదకర వాతావరణంలో వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్నారులు, పెద్దలు పలు రకాల ఆటలు ఆడి సందడి చేశారు. మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, తాడాట, షటిల్, రన్నింగ్ తదితర వివిధ రకాల ఈవెంట్‌లు నిర్వహించారు. అనంతరం ఆటల పోటీలలో గెలిచిన విజేతలకు పట్టణ పౌర సంక్షేమ సంఘ రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబురావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలతో పాటు, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరం కలిసి మెలిసి ఐక్యంగా మెలగాలని కోరారు. స్థానికంగా, పని ప్రదేశాల్లో నిత్య జీవితంలో ప్రజలు, ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తూ.. వాటి పరిష్కారానికి, ప్రజలకు అండగా పౌరసంక్షేమ సంఘం అండగా నిలవాలని కోరారు. నిత్యం ప్రజలకు తోడుగా, నీడగా ఉండాలన్నారు.ఐక్యతే మనందరి బలమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసం స్నేహ సమ్మేళనం, వన భోజనాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు, పౌర సంక్షేమ సంఘం నాయకులు భూపతి రమణారావు, ఐద్వా, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఇతర ప్రజాసంఘాల నాయకులు కాజ సరోజ, జి ఝాన్సీ, షకీల, ఆశా, నిజాముద్దీన్, సిహెచ్ శ్రీనివాస్, బి చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'రామ్‌కీ మెలోడీస్' సంగీత కచేరి

విజయవాడ: "గాన కళా సార్వభౌమ" వైఎస్ రామకృష్ణ (టీం లీడర్) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గాంధీనగర్ విహెచ్ గ్రంథాలయంలో 'రామ్ కి మెలోడీస్' సంస్థ (హైదరాబాద్) సినీ సంగీత విభావరి నిర్వహించింది. ప్రముఖ ఔత్సాహిక గాయనీ గాయకులు లలిత, మధురవీణ, స్వర కళ్యాణి, రాధా రాణి, కెవిబి ఆనంద్, శివరామకృష్ణ, రవీంద్రనాథ్, దేవ కష్ణ, కాశ్యప్, శ్రీధర్ తదితరులు పాడిన ఆయా సినిమాల్లోని హిట్ సాంగ్స్ ప్రేక్షకుల్ని మెప్పించాయి.

వినసొంపుగా 'స్వరార్చన ఆర్కెస్ట్రా' విభావరి

విజయవాడ : ఆదివారం రాత్రి గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై డి.జె. సౌండ్స్ అధినేత డీజే రాము ఆధ్వర్యంలో "స్వరార్చన ఆర్కెస్ట్రా" జరిగింది. విలక్షణ గాయకుడు గుండ్రాతి రంగరాజు నాయకత్వంలో జరిగిన సంగీత కచేరీలో ప్రముఖ వాస్తు పండితుడు టి. శ్రీనివాసరెడ్డి, ఎం.శ్యాంప్రసాద్, కె.డేవిడ్ రాజు, చింతా రజని, కె.శ్రీదుర్గానాగమణి, రంజానీ, శోభారాణి తదితరులు పాడిన సినీ గీతాలు ప్రేక్షకుల్ని అలరించాయి.

నేడు విఎంసిలో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు ఆయా సర్కిల్స్ కార్యాలయాల పరిధిలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం సోమవారం జరుగుతుందని ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నగర వాసులు ఉపయోగించుకోవాలని కోరారు.

ఆకాశవాణి సంగీత సమ్మేళనం అదరహో

విజయవాడ : ఆకాశవాణి సంగీత సమ్మేళనమ్ కార్యక్రమాన్ని ప్రేక్షకులు తన్మయత్వంతో మైమరచి ఆనందించారు. దేశవ్యాప్తంగా 24 నగర, పట్టణ కేంద్రాల్లో జరుగుతున్న జాతీయ 67వ సంగీత సమ్మేళనంలో భాగంగా- విజయవాడలో ఆదివారం రాత్రి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కార్యక్రమానికి నగరంలోని పలువురు ప్రముఖులు, అధికారులు, విద్యావంతులు సహా పెద్ద సంఖ్యలో సాంప్రదాయ సంగీత ప్రియులు విచ్చేసి ఆద్యంతం ఆనందించారు. కార్యక్రమం రెండు విభాగాలుగా జరిగింది. "సంగీత సుధానిధి", 'విదూషి' డాక్టర్ కొల్లూరు వందన గాత్ర కచేరీ.. ఎం.శ్రీరమ్య (వయోలిన్), బి.వి.ఎస్.ప్రసాద్ (మదంగం), ఎ.ఎస్.శంకర్ (ఘటం) అందించిన సహకారంతో ఆద్యంతం ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. వందన- సుబ్బరాయ శాస్త్రి కీర్తన "శంకరి నీవని.." (బేగడ రాగం, రూపక తాళం), ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన "విశాలాక్షీమ్.." (పంతువరాళి రాగం, మిశ్రచాపు తాళం), తిరుపతి నారాయణ స్వామి కీర్తన "ఇకనైనా నా మొర వినరాదా.." (పుష్పలతిక రాగం, ఆది తాళం), త్యాగరాజ స్వామి కీర్తన "నను పాలింప నడచి వచ్చితివో.." (మోహనరాగం, ఆదితాళం), తాళ్లపాక అన్నమాచార్య కీర్తన "మాయలో మోహమున.." (భాగేశ్వరి రాగం, ఖండచాపు తాళం) సంకీర్తనలతో ప్రేక్షకుల్ని కనుచూపు తిప్పనీయలేదు. రెండో భాగంగా- రాష్ట్రంలోనే కాక వివిధ ప్రాంతాల్లో, విదేశాల్లో సైతం అనేకానేక సాంప్రదాయ సంగీత కచేరీలిచ్చి ప్రఖ్యాతినొందిన మోదుమూడి సుధాకర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో - దర్భ మదురవళి, బి.వి. విద్యాసాగర్, ఎన్.సి.శ్రీమహతి పాడిన దేశభక్తి, జానపద గీతాలు ప్రేక్షకుల్ని ఆనంద డోలికల్లో ముంచెత్తాయి. ఎన్.సి.చక్రవర్తి రచన "పునీత వేదనాదమై.." (దేశభక్తి గీతం, గ్రూప్), వేటూరి సుందర రామమూర్తి రచన "ఏటి తల్లి ఒళ్లంతా రాళు .." (జానపద), పారుపల్లి శ్రీరామమూర్తి రచన "తరుణుల నయనాలు"తోపాటు భువనచంద్ర, సామవేదం షణ్ముఖ శర్మ, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గీతాలను కూడా హాయిగా ఆలపించారు. కె.సుబ్రహ్మణ్య రాజు (వయోలిన్), ఎస్.కుమార్ బాబు (ఫ్లూట్), వి.చిట్టిబాబు (డోలక్), ఎం.వి.సాయికిరణ్ (తబల), ఎవి.రమణ (ప్యాడ్స్) సహకారం కార్యక్రమం విజయవంతానికి ఎంతగానో దోహదపడింది.

విశ్వసనీయతకు మారు పేరు 'హరివిల్లు గ్రీన్ విస్తార'

విజయవాడ : 'హరివిల్లు గ్రీన్ విస్తార' వంటి ప్రాజెక్టులు ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతమిస్తాయని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. హరివిల్లు గ్రీన్ విస్తార ప్రాజెక్టులో భాగంగా గండిగుంటలో 23 సె.మీ విల్లా ఆధారిత ఇండిపెండెంట్ హౌసెస్, 4 అంతస్తుల క్లబ్ హౌస్‌కు ఆదివారం భూమి పూజా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ప్రత్యేక అతిథిగా హరివిల్లు గ్రూప్ చైర్మన్ వేములపల్లి లక్ష్మణ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ... గండిగుంట ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న వసతి ప్రదేశంగా మారుతోందని, హరివిల్లు గ్రీన్ విస్తారం వంటి ప్రాజెక్టులు ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిస్తాయని తెలిపారు. జనాలకు అందుబాటు ధరల్లో.. ఆధునిక సౌకర్యాలతో ఇళ్లను అందించాలనే సంస్థ ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు. వేములపల్లి లక్ష్మణ మాట్లాడుతూ.. హరివిల్లు గ్రూప్ నాణ్యత, విశ్వసనీయత, కస్టమర్ సంతృప్తి ప్రాధాన్యంగా తీసుకొని ముందుకు సాగుతోందన్నారు. 23 సె.మీ విల్లాలు, 4-అంతస్తుల క్లబ్ హౌస్ గండిగుంట రియల్ ఎస్టేట్ స్టాండర్డ్స్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్తాయన్నారు. ప్రస్తుతం విజయవాడకు నాలుగు వైపులా ప్రాజెక్టులు ఉన్న ఏకైక సంస్థ హరివిల్లు మాత్రమేనని తెలిపారు. త్వరలో మరిన్ని

ప్రాజెక్టులు ప్రారంభించబోతున్నామని అన్నారు. హరివిల్లు ప్రాజెక్టుల కస్టమర్లు మాట్లాడుతూ.. 'మేము కొనుగోలు చేసిన ప్లాట్లు సమయానికి డెవలప్ కావడం, విలువ పెరగడం హరివిల్లుపై మరింత నమ్మకాన్ని పెంచింది. గ్రీన్ విస్తార మాకు ఎంతో ఆనందం ఇస్తోంది" అని తెలిపారు. భూముల ఖరారు నుండి రిజిస్ట్రేషన్ వరకు సంస్థ విధానం పూర్తిగా పారదర్శకంగా ఉండటం హరివిల్లును ప్రత్యేకం చేస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, హరివిల్లు గ్రూప్ సీఈవో జాస్తి ప్రసన్న, అడ్మిన్ మేనేజర్ పద్మజ, రిలేషన్షిప్ మేనేజర్ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజల నుండి వినతుల స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : నవంబర్ 17వ తేదీ సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.